# దేవుడి సొమ్ము

శరత్కాలం. సాయం సంధ్య వర్ణ శోభ ప్రపంచాన్ని ముంచెత్తుతున్నది. పగలంతా క్షేత్ర సంచారం చేసిన పక్షులు, ఇంటి ఎదురుగా ఉన్న రావిచెట్టు మీదికి వచ్చి చేరుకుంటున్న వాటి సంతోషం, ప్రతిరోజూ కొత్తగానే ఉంటుంది సత్యంకి. వీధిలో జనం వస్తూ పోతూ కన్పిస్తున్నారు.

ఉత్తరంగా ఎదురుచేసిన ఆ ఇంటి పెరటి వంట గదిలో అమ్మ ఏడుస్తున్నది. నాలుగు దినాలుగా అమ్మ ఒకటే ఏడుపు. రాత్రింబగళ్లు ఏడుపు. వంటలేదు. తిండిలేదు. ఆకలి లేదు.

పదేళ్ల తమ్ముడు చిట్టి అమ్మ ఏడుపు వింటూ, మధ్య మధ్య తన చేత్తో అమ్మ కన్నీళ్లు తుడుస్తూ అమ్మ దగ్గరే కూర్చున్నాడు.

వరద వచ్చిన ప్రతీసారి అమ్మ దుఃఖం వరదలా ఉప్పొంగుతుంది. తల్లిప్రేమ సుళ్లు తిరిగి దుఃఖంతో ముంచెత్తుతుంది.

ఆ రోజు వంశధార వరద, ఒడ్డున ఉన్న ఊళ్లనీ వాడలనీ ముంచేసింది. తమ పేద జీవితానికి పెన్నిధి పద్మక్కను నదీమాత తన పొట్టను పెట్టుకుంది. తండ్రి దిక్కులేని తమ పేద జీవితానికి, అక్క ఉదారత అండగా నిలిచి తిండిపెట్టి తమని కాపాడుతుండగా, పద్మక్క వరదలో కొట్టుకుపోయి చనిపోయింది. దాంతో తమ బతుకు అల్లకల్లోలమయిపోయింది. ప్రతి ఏడు వరదలు వస్తూనే ఉన్నాయి. ఆరోజు అమ్మ గుండె వరదై కన్నీరు మున్నీరవుతుంది. ఆరోజు అమ్మకి నిద్రాహారాలు ఉండవు. అమ్మ ఈ దుఃఖంతో మరింత కుంగిపోయింది. ఆరోగ్యం క్షీణించి పోయింది. ఇరుగు పొరుగువారు వచ్చి ఓదారుస్తారు. 'పాపం కూతురు మతి పడ్డాది. కన్న కడుపు బాధ' అని నిట్టూరుస్తారు. మళ్లీ ఎవరి పనుల్లోకి వాళ్లు వెళ్లిపోతారు.

అమ్మ దుఃఖం, అమ్మ కన్నీళ్లు సత్యంకి అలవాటయిపోయాయి. మధ్య మధ్య ఓదారుస్తాడు. కట్టలు తెంచుకుని పొంగుకొస్తున్న ఆ దుఃఖానికి బాధతో పాటు కొన్నిసార్లు అమ్మ మీద కోపమొస్తుంది. వంట చేయదు. తిండి తినదు. పచ్చి మంచి నీళ్లు కూడా తాగదు. ఇరుగు పొరుగు వాళ్లు ఆ పిల్లలను తమ ఇళ్లకు తీసుకుపోయి ఆ రెండు మూడురోజులు తిండి పెట్టారు. వాళ్లే ఆ అన్నదమ్ముల్ని ఓదారుస్తారు.

పొరుగూరు పెద్దరైతు పద్మక్కను కోరికోరి పెళ్లి చేసుకున్నాడు. తండ్రి దిక్కులేని ఆ

కుటుంబానికి పద్మ పెళ్లి తర్వాత ఆ అల్లుడు పెద్దదిక్కయి నిలబడ్డాడు. ఆ అత్తవారి ఇంట్లో అంతా పద్మక్క పెత్తనమే. ఆడపడుచులు లేరు. పద్మక్క తన కన్నవారిని అన్ని విధాలా ఆదుకుంది. ఇంటి అవసరాలు నిండుకోకముందే పంపించేది. ఖర్చులకు తల్లి చేతిలో పైసలు పెట్టేది. తల్లినీ, తమ్ముళ్లనీ తన దగ్గర ఉంచుకునేది. అట్లా నాలుగయిదేళ్లుసాగాయి. అక్క దగ్గరే ఉండి తమ్ముళ్లు చదువుకున్నారు. సత్యం హైస్కూల్ చదువు ఆ ఏడాది ముగుస్తుందనగా అక్క చనిపోయింది. ఒకటే కుటుంబంగా సాగుతున్న బతుకు దాంతో మళ్లీ మొదటికొచ్చింది. ఇద్దరు కొడుకులను తీసుకొని పుట్టెడు దుఃఖం మోసుకుంటూ తల్లి తిరిగి సొంత ఊరు వచ్చింది. ఇద్దరు కొడుకులు ఉన్నారన్న ఆలోచన లేకపోతే కూతురుతోపాటు ఆ వరదలో కలిసి పోయేదే. ఆ గంగమ్మ తల్లి తనని మాత్రం కాదనేదా?

పద్మక్క బ్రతికే ఉంటే సత్యం కాలేజీ చదువులు ముగించి ఈనాడు ఉద్యోగం చేస్తూ ఉండేవాడు. తమ్ముడిని చదివించేవాడు. తల్లిని పోషించుకునేవాడు. ఇరుగు పొరుగు వారికి సహాయపడేవాడు. స్నేహితులను ఆదుకునేవాడు. తాము గుట్టుగా గౌరవంగా బ్రతికేవాళ్లు.

సత్యం ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తునే ఉన్నాడు. ఏదీ కలిసి రాలేదు. ఇప్పుడు ఈ ఊళ్లో ఉండాలని లేదు. కాని అమ్మనీ, తమ్ముడినీ విడిచిపెట్టి దూరంగా ఎక్కడికీ పోలేకపోతున్నాడు.

రోజు రోజుకీ కాంతి హీనమైపోతున్న అమ్మ కళ్లు. శిథిలమైపోతున్న ఆరోగ్యం. బెంగ. దిగులు. సత్యానికి తన బాధ్యత గుర్తొచ్చింది. ఈ వరదకు ఎదురీది గట్టెక్కడానికి సిద్ధపడాలి. ఉద్యోగం ముందు. తనలాగే కష్టాల్లో ఉన్న తన స్నేహితులు ఖరగ్‌పూర్, రూర్కెలా, భిలాయ్, దుర్గాపూర్, కలకత్తా, అస్సామ్, విశాఖపట్నం పొట్టచేతపట్టుకుని పారిపోయారు. కొందరు తన నేస్తాలు మిలటరీలో చేరిపోయారు. మిలటరీలో చేరిపోవడమే సత్యంకి ఇష్టం. ఇంకా తనలాగే ఉద్యోగం సద్యోగంలేని మరికొందరు తన ఈడువాళ్లే మిలటరీలో చేరిపోవాలని దేవుని మొక్కుకుంటున్నారు. తనకు సైనికుడు కావాలని ఉంది. సైనికుడై మిలటరీ ఖాకీ దుస్తుల్లో ఈ ఊళ్లో అడుగుపెట్టాలని ఉంది. త్వరలోనే విశాఖపట్నం వెళ్తే అక్కడ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఉంటుంది. వెళ్లటానికి రైలు టికెట్టుకు, వారం పది దినాలు ఉండటానికి పైసలు కావాలి..... ఆ పైసలు కూడా లేవు..... అప్పు అడగాలి.

అమ్మ దుఃఖాన్నీ, దీనావస్థనీ, చూడలేక ఇంతసేపు అమ్మ దగ్గర కూర్చున్న తమ్ముడు చిట్టి బైటికి వచ్చి అరుగు మీద దిగులుతో కూర్చున్నాడు. అమ్మ హృదయవిదారకమైన

రోదన తట్టుకోలేకపోతున్నాడు. పద్మక్క గుర్తొచ్చినప్పుడల్లా పెన్నిధి కోల్పోయిన బాధ హింసిస్తుంది. మనస్సు కుంగిపోతుంది. ఏమీ తోచదు. ఈ దారిద్ర్యం ఇంక భరించలేరు.

పద్మక్క పుటం పెట్టిన బంగారంలా మెరుస్తుండేది. కళ్లు మంచుతో తడిసి మెరిసే కలువరేకుల్లా ఉండేవి. అక్క రూపం దేవీ అవతారంలా ఉండేది. విరిసిన సౌందర్యంతో తొణికిసలాడేది. తమ్ముళ్లను ఎంతో ముద్దు చేసేది. అమ్మని మురిపించేది. అక్క అంటే ఊళ్లో అందరికీ ముద్దే. అన్నీ కలిపి అక్కని పొరుగూరు ముద్దులకోడలను చేశాయి. ఏదో పెళ్లిలో పద్మక్కను చూసాడు బావ. కావాలని వరించి ఈ పేద ఇంటి అమ్మాయిపై మోజుపడి ఎంతో సంతోషంగా పెళ్లి చేసుకున్నాడు. ఇరుగు పొరుగు గ్రామాలలో పెద్ద రైతులు, భూస్వాములనుండి వచ్చిన సంబంధాలను సైతం కాదని పద్మక్కను వరించాడు. పద్మక్క చనిపోయి ఆరేళ్లయినా బావ రెండో పెళ్లి చేసుకోలేదు. రెండో పెళ్లి తలంపు పెట్టుకోలేదు. 'చిన్న వయసు. మళ్లీ పెళ్లీ చేసుకోనాయినా' అని అమ్మ బతిమాలి చెప్పింది. కాని ఒప్పుకోలేదు.

బావ సహాయం ఇప్పటికీ అందుతూనే ఉంది. దాంతోనే ఈ బతుకు తిండికి లోటు లేకుండా సాగుతున్నది.

* * *

పచ్చగా ఎత్తుగా గుబురుగా పెరిగిన సరుగుడు తోటల్లోంచి పోతున్నాడు సత్యం. ఊరుకు దాదాపు ఫర్లాంగ్ దూరంలో వరదతో ఉప్పొంగుతూ వంశధార. నదికి ఆవలి ఒడ్డున కూడా సరుగుడు తోటలే. ఆ తోటల్లో నిన్న మొన్నటి వరకు వరద నీరు ప్రవహించింది. చుట్టుప్రక్కల పంట పొలాలు వరదనీటిలో మునిగి పంట పాడయింది.

సూర్యుడు అస్తమించి చాలాసేపయింది. మెల్లమెల్లగా ముదురు రంగుల ప్రకృతి చీకటి నక్షత్ర రాశితో విశ్వాంతరాళకి వ్యాపిస్తున్నది.

ఇంట్లో ఊపిరాడనంత ఉక్కిరిబిక్కిరై సత్యం బైటికి వచ్చాడు. వచ్చి నది ఒడ్డున కూర్చుంటే తనకి ఈ బాధ ఉండదు. మనసు తేలిక పడుతుంది. నదిలో నాలుగు మునకలు మునిగి స్నానం చేస్తే మనసులో దుఖ్ఖాన్నీ బాధనీ కడిగేసుకున్నంత తేలికగా ఉంటుంది.

అక్కడకు దాదాపు మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలోనే తూర్పున బంగాళాఖాతం. అక్కడ ఈ నదీమాత సముద్రదేవత ఒడిలోకి చేరిపోతుంది.

వరద ఒండ్రుతో నిండిన నేలమీద అడుగులు జారుతున్నా దారి చేసుకుంటూ ముందుకు పోతూనే ఉన్నాడు. నది ఒడ్డున అక్కడా అక్కడా వరదలో కొట్టుకొచ్చిన పెద్ద పెద్ద చెట్లమానులను, దుంగలను ఒడ్డుకు తెచ్చుకుంటున్నారు. ఇద్దరు ముగ్గురు

ఒక్కే చోట. ఈ కట్టెలు ఒడ్డుకు చేర్చే పనిలో రెండు మూడు చోట్ల వాళ్లు కన్పిస్తున్నారు. వాళ్లు తమపనిలో నిండా మునిగి ఉన్నారు. ఆవలి ఒడ్డున మహా బౌద్ధక్షేత్రం సాలిహొండాం కొండ. ఆ సుందర ప్రకృతి అంతా సత్యం సొంతం.

ఆ చుట్టూ చీకటి. నక్షత్రాలు. తూర్పున బహుళ పాడ్యమి చంద్రుడు. నదిని సమీపిస్తున్న కొద్దీ మనస్సు నిండా కొండంత ధైర్యం. తన శరీరంలో ఉప్పొంగుతున్న ఉత్సాహం.

రేపు తన ప్రయాణం. విశాఖపట్నంలో తన మిత్రులున్నారు. రమ్మని చాలాసార్లు పిలిచారు. రేపు ఈ ఊరు విడిచిపెడ్తున్నాడు. తను ఉద్యోగంలో చేరితే - కొడుకు ప్రయోజకుడయినందుకు తల్లి సంతోషిస్తుంది.

అంతలోనే కళ్లముందు కన్పిస్తున్న వరదల నది మీద ఆగ్రహం. తన అక్కను, పద్మం లాంటి తన అక్కను పొట్టన పెట్టుకుని తమ కుటుంబాన్ని కన్నీళ్ల ముంచినందుకు ఉద్రేక ఉగ్రమూర్తి నది మీద ఆగ్రహం.

అక్క చనిపోయిన రోజుల్లో ఓదార్పు మాటల్లో ఎవరో అన్నారు ఆ గంగమ్మ తల్లి తన ఒడిలోకి తీసుకున్నాదని. పద్మమే పద్మక్కయి పుట్టి మళ్లీ పద్మమైపోయిందా? కొన్నిసార్లు అక్క చనిపోయినట్టు కూడా ఉండదు. ఎక్కడో మన కండ్లకి అందని దూరంలో ఉన్నట్టే అన్పిస్తుంది. పద్మక్క ఉన్నట్టే అనిపిస్తుంది. అక్కకు చావు లేదనిపిస్తుంది. అమ్మలో పద్మక్క కన్పిస్తుంది. తమ్ముడిలో పద్మక్క కనిపిస్తుంది. బహుశా బావకూడా తన కండ్లకు అందని దూరంలో ఉన్నట్టే కన్పిస్తున్నదో ఏమో.

ఎంతసేపయిందో....

వరదలో కొట్టుకువస్తున్న కట్టెలను, చెట్లను అందుకుని ఒడ్డున వేసుకుంటున్న మనుషులు కనిపించటంలేదు.

సముద్రపవనాలు సరుగుడు తోటల్తో గొంతుకలిపి పాడుకుంటూ పోతున్నాయి. రాత్రి పిట్టలు, కీచురాళ్ల అరుపులు.

ఇసకలో ఒడ్డున కూర్చున్నాడు సత్యం. కల్లోలిత హృదయంలా నది ఇంకా ఉధృతంగా ఒడ్డును ఒరుసుకుంటూ ప్రవహిస్తున్నది.

నది వరదలో దూకి ఆవలి ఒడ్డుకు పోయి రావాలనిపించింది సత్యంకి. అది అలవాటే. స్నేహితులతో పందేలు వేసి గజ ఈతగాడనిపించుకున్న వాడు సత్యం. నదిలోనేకాదు. సముద్రంలో కూడా ఈతలో మెప్పుపొందినవాడు. నదిలో గంటల గంటలు ఆడుకోవడం ఎంతో ఇష్టం. ఎవరన్నా స్నేహితుడు తోడు ఉంటే అంత పనీ చేసేవాడే.

ఇరవైయ్యేళ్ల నిరుద్యోగి. బావ పంపించే సహాయం ఒక్కటే ఇప్పుడు ఆధారం.

ఒళ్లు పులకించింది. చల్లని గాలులకు ఉత్తేజం పొందింది. నదిలో దూకి ఒడ్డునే కొంత సేపు ఈతకొట్టాలని ఉంది. స్నానం చేయాలి.

నదీ దేవి 'రేపు ఈ ఊరు విడిచిపెట్టి వెళ్లిపోతున్నావు కదా వచ్చి ,స్నానం చెయ్యి. పొట్టకూటి కోసం ఎక్కడికి పారిపోతావో, రా నాన్నా రా, తనివితీరా ఆడుకో. స్నానం చెయ్యి. వెళ్లిపో, నీ స్నేహితులు నిన్ను ఆదుకుంటారు లే. అమ్మకేం త్వరలోనే అంతా మరచిపోతుంది. అమ్మ ఆశీస్సులు తీసుకో. అంతా మంచి జరుగుతుంది. శుభం జరుగుతుంది. నాన్నా రా. నా ఒడిలో ఆడుకో.....' అని పిలుస్తూనే ఉంది.

చొక్కా తీసి ప్రక్కగా పెట్టి, పేంట్ కూడా తీసి, అండర్‌వేర్‌తో నీటిలో అడుగు పెట్టాడో లేదో నది సుళ్లు తిప్పి లోపలికి లాక్కుపోయింది. ప్రవాహం వేగానికి నిలదొక్కుకోవటం సత్యంకి తెలిసిందే. కాని అంతలోనే తనని కబళిస్తున్నట్టు..... ఏదో బలంగా తాకింది. చూస్తే తెల్లటి చీరతో స్త్రీ శరీరం. నదిలో కొట్టుకుపోతున్నది. చేత్తో.....వెంటనే ఆ శరీరాన్ని గట్టిగా పట్టుకున్నాడు. నల్లగా కేశరాశి. భయపడ్డాడు. అంతలోనే ధైర్యం. శరీరాన్ని విడిచిపెట్టలేదు.

ఇద్దర్నీ ప్రవాహం నెట్టుకుపోతున్నది. కాళ్లకు నేల అందటం లేదు. ఒడ్డున ప్రవాహం మరింత బలంగా ఉంది. దాదాపు రెండు మూడు ఫర్లాంగులు కొట్టుకుపోయిన తర్వాత వరద కోతతో వేళ్లతో కూలి పడిపోయిన చెట్టు అడ్డం వచ్చిన దగ్గర సత్యంకి వరద ఉధృతిని  తప్పించుకునే బలం చిక్కింది.

ఆ స్త్రీ శరీరాన్ని నెమ్మదిగా ఒడ్డున చేర్చాడు. చనిపోయే ఉంది. చనిపోయిన ఈ శరీరాన్ని తను ఎందుకు ఒడ్డుకు తెచ్చినట్టు. బతికి ఉందా? ప్రాణం ఉందా? ఊపిరాడుతున్నదా?

పద్మక్కవయస్సే. పద్మక్క.....

మెడనిండా నగలు. చేతికి బంగారు గాజులు.

ఆ శరీరాన్ని అక్కడే వదిలేసి పరుగు పరుగున ఊళ్లోకి వెళ్లి ఊళ్లో ఈ సంగతి చెప్పి వాళ్లను తీసుకురావాలని. దాదాపు నాలుగు ఫర్లాంగుల దూరంలో ఊరు.

నక్కల ఊళలు. దగ్గర్లోనే.

తనుపోయిన తర్వాత నక్కలు వచ్చి ఈ శరీరాన్ని......

ప్రవాహానికి కొద్దిగా దూరంలో ఉండాలని - నేలమీద ఆమెని లాక్కుపోవటం తప్పు అనిపించి - చేతుల మీదికి ఎత్తుకోవాలనిపించి - శరీరం  అప్పటికే బిగుసుకుపోయినట్టుగా ఉంది. బాగా బరువు.... నాలుగయిదు గజాల దూరంలో నెమ్మదిగా నేల మీదికి దించాడు.

నగలు.... నగలు.... నగలు.... బంగారం

ఆ నగలు తీసేసుకున్న తర్వాత ఊళ్లో తెలిస్తే.....

బంగారం నగలు....

కాళ్ల దగ్గరకు వచ్చింది సిరి....

ఆ బంగారు నగలు నీవే.... నీవే.... నీవే ఏంచేస్తావో చెయ్యి....

కాదూ ఊళ్లోకి పోయి వెంటనే చెప్పు.

ఎవరో పొరుగూరు ఆడమనిషి... చిన్నవయసుదే..... ఆ మనుషులు వచ్చి చూసి బంగారు నగలు పోయాయని వాళ్లు బయట పెట్టే.....

తన దొంగతనం బయటపడుతుంది. తప్పదు.

నగలు తీసుకో. శరీరాన్ని నదిలో వరదలో వదిలేయి. అర్ధగంటలో ఈ శరీరం సముద్రంలో కలిసిపోతుంది.

వెన్నెల.... పద్మక్కవయసే..... పద్మక్క మొహం మీద వెన్నెల కురుస్తున్నది.

నిన్నెవరూ చూడటం లేదు.

నగలు ఒక్కటొక్కటే ఆమె మెడలోంచి తీసేసి ప్రక్కన వేశాడు. చేతుల నుండి గాజుల తీశాడు.

ముగ్ధ మోహన రూపంతో ఆ సౌందర్యనిధి కాలిగోటికి సరిపోవు ఆ నగలు....

బ్రతికే ఆశలేదా?

ఆమె బ్రతికితే. అట్లా చచ్చిపోయారనుకున్నవాళ్లు కొందరు బ్రతికినట్టు కథలు చెప్తారు కదా.....

వెన్నెల మరింత కాంతి వంతమయింది.

తన వెనుక ఎవరో దొంగ..... దొంగ..... దొంగ..... అని అరుస్తున్నట్టుంది.

నీవు చేస్తున్నది నేరం. తప్పు. దొంగతనమే.

పోలీసులకు తెలుస్తుంది. ఊళ్లోకి వచ్చి నిన్ను పట్టుకుపోతారు. నిన్ను పోలీస్‌స్టేషన్‌లో కొట్టారు. తర్వాత జైల్లో పెట్టారు. నీ తల్లికి ఎంత అవమానం. నీ బావకి ఎంత పరువు తక్కువ. వీడి అన్న దొంగ. ఇప్పుడు జైల్లో ఉన్నాడు. అంటారు నీ తమ్ముణ్ని.

మెడకు బిగుసుకుపోయింది పట్టెడ. వెల్లకిలాపడి ఉన్న ఆ శరీరాన్ని ప్రక్కకు తిప్పి మెడ దగ్గర మర తిప్పి తీస్తేనే వస్తుందా నగ. బిళ్లలు కూర్చిన దారాలు తడికి నాని మెడకి బిగుసుకుపోయింది.

మర తిరిగి నగ ఊడినప్పుడు 'ఏవ్' మని బుక్కెడు నీళ్లు నోట్లోంచి బైటపడ్డాయి.

వొళ్లు జల్లుమంది.

బతికే ఉందా?

ముఖం నిండా చెమట. కంపరమెత్తిపోయింది ప్రాణం.

కొంచెంసేపు ఏమీతోచలేదు.....

నక్కల ఊళలు....

ఆ శరీరాన్ని ఎత్తుకుని వరద నీటిలోకి నెమ్మదిగా దిగవిడిచాడు.

ప్రవాహం వేగంతో క్షణంలో ఆ దేహం అదృశ్యమైపోయింది.

వచ్చి నగలు దగ్గర కూర్చున్నాడు.

తన చొక్కా పేంట్ అక్కడెక్కడో ఉన్నాయి. నగలు చేత్తో పట్టుకుని తన చొక్కా పేంటు కోసం వెనక్కి నడవసాగాడు.

భయంగానే ఉంది. గుండె బరువెక్కిపోయి కొట్టుకోసాగింది.

ఎవరూ తనని చూడలేదు కదా.

తను దొంగతనం చేయలేదు. తనకు అదృష్టవశాత్తు దొరికింది. లేకపోతే సముద్రంలో ఈ నగలు కలిసిపోయేవి.

తప్పు కాదా? ఆ శరీరాన్ని ఒడ్డుకు తీసిన వాడివి. ఊళ్లో పెద్దలకు చెప్తే ఆ చనిపోయిన మనిషి ఎవరో తెలియక పోయేదా? ఆమె తల్లిదండ్రులూ, ఆమె భర్తా, ఆమె అత్తమామలు, బంధువులూ, ఊళ్లోవాళ్లు - అంతా కలిసి చనిపోయిన ఆమె శరీరాన్ని చూసేవారు కదా......

నిన్ను అంతా మెచ్చుకునే వాళ్లుకదా. నీ గురించి ఆ చుట్టు ప్రక్కల ఊళ్లోవాళ్లు సైతం ఎంతో మెచ్చుకునేవాళ్లు కదా!

పద్మక్క గురించి రెండో రోజే తెలుసుకదా! రెండు కిలోమీటర్ల దూరంలో వేరే ఊళ్లో దొరికినప్పుడు.... పద్మక్క వరదలో కొట్టుకుపోయింది పగటిపూటే కావచ్చు.....

మనిషి చనిపోయినా బంగారం దొరికింది. మనిషి దొరికింది అన్నారు జనం. అవునా కాదా?

ఇప్పుడు ఏం చేయాలి? ఈ నగలను ఏం చేయాలి? ఎట్లా దొరికాయని చెప్పాలి?

నదిలో స్నానం చేసుకుంటుంటే శవం కనబడింది. దాన్ని పట్టుకుని ఒడ్డుకు తీసుకుని వచ్చి ఆమె వంటి మీద నగలు తీసుకుని తిరిగి ఆ శరీరన్ని నదిలో వదిలి పెట్టేసినట్టు చెప్పుకోవాలా?

సత్యం నడుస్తూనే ఉన్నాడు. అతడు ఒడ్డున ఆగిన చోటు అతడికి గుర్తే.

జరగరానిది జరిగిపోయింది. ఇప్పుడు ఏంచెయ్యాలో, ఎట్లా చక్కదిద్దుకోవాలో తోచటం లేదు.

ఒక ప్రక్క భయం. చెప్పరానంత భయం. మరో ప్రక్క తెచ్చిపెట్టుకుంటున్న, తనపనిని తానే సమర్థించుకుంటున్న ధైర్యం.

ఎవరన్నా తనని చూచారో ఏమో. ఆ సరుగుడు తోటల్లోకిపోయే కాలిబాటలో ఊరిజనం అర్ధరాత్రి వరకు ఏవేవో పనులమీద తిరుగుతూనే ఉంటారు. చూశారో ఏమో.

చూస్తే వచ్చి కేకేసి పిలవకపోయేవారా?

ఎవరూ తనను చూడలేదు.

అమ్మకి జరిగినదంతా చెప్పేస్తాను. అమ్మ ఏమంటుదో. అమ్మ కొత్త కష్టాల పాలవుతుందా? ఊళ్లో వాళ్లు తనను పట్టుకుని తిట్టి ముఖం మీద ఉమ్మేస్తారేమో. కొట్టారేమో. పోలీసులకు అప్ప జెప్తారేమో.

రేపటి నుంచి తన బతుకు ఏమవుతుందా?

రేపు తను ఉద్యోగం కోసం విశాఖపట్నం పోతున్నాడా?

బస్సు టికెట్టుకు, ఖర్చులకు అప్పు దొరుకుతుందా?

తన బట్టలున్న చోటుకు వచ్చాడు సత్యం.

ఒంటి మీది బనియన్ తీసి, దాన్ని పిండి, ఒళ్లంతా దాంతోనే తుడుచుకుని పేంటు షర్టూ తొడుక్కున్నాడు.

ఇప్పుడు ఈ నగలను అమ్మకు చూపకూడదు. అమ్మకు ఈ సంగతి చెప్పనే కూడదు.

ఇంటి దారి పట్టాడు.

ఈ నగలను ఏం చెయ్యాలి? ఈ ఆపదనుండి బయటపడడమెలా? ఇక్కడే పారేసి పోతే..... బంగారు నగలు. బంగారం. తమ కష్టాలన్నింటి నుండి గట్టెక్కించే బంగారం.

దేవుడిచ్చాడు తనకు. తిరిగి దీన్ని దేవుడికే ఇచ్చేయాలి.

ఊరు దగ్గర పడింది. ఊళ్లో.... రెండు వీధులు దాటితే తమ ఇల్లు.

* * *

ఇంట్లో దీపం వెలుగుతున్నది.

తమ్ముడు అరుగుమీద చీకట్లో గోడ దగ్గర కడుపులోకి కాళ్లు ముడుచుకుని నిద్రపోతున్నాడు. తన ఇంట్లో తనే దొంగలా అడుగు పెట్టాడు. తన చేతిలోని నగలమూట ఎవ్వరూ చూడకూడదు. తన అడుగుల చప్పుడు తననే భయపెడ్తున్నాయి.

అమ్మ ఏడ్చేడ్చి అలిసిపోయి నిద్రలో ఒరిగిపోయి ఉంది.

ఎవరికీ కనిపించదనిపించే దగ్గర ఆ మూట దాచిపెట్టాడు. తర్వాత ఇంకా భద్రంగా దాచి పెట్టొచ్చు.

గుండె లోపల బరువంతా ఒక్కసారి మటుమాయమయింది.

అమ్మ తిన్నదో లేదో, తమ్ముడు తిన్నాడో లేదో.

వంటగదిలో...... ఎవరో తెచ్చిపెట్టిన అన్నం, చారు, కూర - ఒకరికి సరిపడా ఉన్నాయి.

ఆకలి లేదు.... తినాలనీ లేదు.

అమ్మ దగ్గర కూర్చున్నాడు. దీపం వెల్తురులో అమ్మ ముఖం దుఖ్ఖాన్ని దిగమింగుతున్నట్టుగా కన్పించింది.

అమ్మను చూస్తుంటే అన్పించింది.

అది దేవుడిసొమ్ము. తనకు వద్దు. తిరిగి దేవునికి ఇచ్చేయాలి. హుండీలో పడివేయాలి.

*

*'కాటేసిన సిరి' పేరుతో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురితం*